ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలి


బాక్స్ క్రికెట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: యువత స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకొని పురోగతి సాధించాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని బ్యాంక్ కాలనీ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన పీపీ బాక్స్ క్రికెట్‌ను గురువారం ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మొద్దు లచ్చిరెడ్డి, రాగుల వెంకటేశ్వరరెడ్డి, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షులు కటికిరెడ్డి అరవింద్‌రెడ్డి, నిర్వాహకులు ప్రసన్నకుమార్, శ్రీనివాస్, నాయకులు అనిల్ చౌదరి, ముద్దగౌని సతీష్‌గౌడ్, రాఘవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై ఎమ్మెల్యే బలాల సమీక్ష


సమీక్షలో పాల్గొన్న ఎమ్మెల్యే బలాల, కార్పొరేటర్లు, అధికారులు

మలక్‌పేట: నియోజకవర్గం పరిధిలో నెలకొన్న విద్యుత్ సమస్యలపై మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల గురువారం విద్యుత్‌శాఖ అధికారులతో సమీక్షించారు. పంజేషాహలోని కార్యాలయంలో అభివృద్ధి పనులపై చర్చించారు. పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేయాలని, కొత్తవాటికి ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, శిథిలమైన కరెంట్ స్తంభాలు తొలగింపు, అప్రకటిత విద్యుత్ కోతలు లేకుండా చూడాలన్నారు. ట్రీ కట్టింగ్, తొలగింపులో నిర్లక్ష్యం పనికిరాదన్నారు. కార్పొరేటర్లు సయ్యద్ మినాజుద్దీన్, అబ్దుల్ సలామ్ షాహిద్, డీఈ విష్ణువర్ధన్‌రెడ్డి, ఏడీ శోభన్‌బాబు, వినోద్, ఏఈలు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, మజ్లిస్ నేతలు షఫీయుద్దీన్, అబ్రార్ పాల్గొన్నారు.

అన్నదాతలకు సేవ చేసే అవకాశమే అదృష్టం

మార్కెట్ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్


శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న దృశ్యం

సైదాబాద్: ఆరుగాలం శ్రమించి తమ పంటలను అమ్ముకోవడానికి మార్కెట్‌కు వచ్చే అన్నదాతలైన రైతులకు సేవ చేసే అవకాశం దక్కడం తన అదృష్టంగా భావిస్తున్నానని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ వైస్‌చైర్మన్ కోట్ల శ్రీనివాస్ అన్నారు. జిల్లా మార్కెట్ కమిటీ నూతన వైస్‌చైర్మన్‌గా నియమితులైన ఆయనను గురువారం లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు సన్మానించారు. లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ గవర్నర్ డి.కోటేశ్వరరావు శాలువాతో కోట్ల శ్రీనివాస్‌ను సన్మానించి పూలబొకే ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మార్కెట్‌లో రైతులు గిట్టుబాటు ధరలు పొంది సంతోషంగా తమ గ్రామాలకు తిరిగి వెళ్లేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ కో ఆర్డినేటర్ యాదయ్య గౌడ్, భరత్‌రాజ్, కేబినెట్ మెంబర్లు కోట్ల రామ్మోహన్, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

నాగోలు: బండ్లగూడ ఫతుల్లాగూడ గ్రామ కంఠం స్థలాన్ని అక్రమించుకొని అక్రమ నిర్మాణాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఫతుల్లాగూడ గ్రామస్తులు కాటేపాక జంగయ్య, చందు, భాను, రమేష్, వినయ్ గురువారం జీహెచ్‌ఎంసీ ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఫత్తులగూడ గ్రామంలో ఉన్న 2500 గజాల స్థలాన్ని అక్రమించుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. అక్కడ జీహెచ్‌ఎంసీ అధికారులు ఎలాంటి అనుమతులు లేకుండా గ్రామ కంఠ స్థలంలో అక్రమ నిర్మాణాలు చేస్తున్నారని తెలిపారు. అక్రమంగా ఇంటి నిర్మాణాలు అనుమతులు పొందుతున్నారని, వెంటనే అక్రమ నిర్మాణాలను అపాలని కోరారు. తప్పుడు పత్రాలు సృష్టించి కరెంట్ మీటర్ల పొందాలని ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. అనంతరం ఫతుల్లాగూడ గ్రామస్తులు బండ్లగూడ విద్యుత్ శాఖ ఏఈని కలిసి ఫతుల్లాగూడ గ్రామ కంఠ స్థలంలో నిర్మాణంలో చేపట్టే నిర్మాణాలకు కరెంట్ మీటర్ల కోసం అనుమతులు ఇవ్వద్దని కోరారు.

తక్కువ ధరకే కెమెరా ఇస్తానని మోసం

నాగోలు: తక్కువ ధరకే ఎఫ్‌ఎక్స్3 కెమెరా దొరుకుతుందని చెప్పి నగదు తీసుకుని కెమెరా ఇవ్వకుండా మోసం చేసిన సంఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎల్‌బీనగర్ పోలీసుల సమాచారం మేరకు... మాన్సూరాబాద్, కాస్మోపాలిటన్ కాలనీ చెందిన బొడ్డుపల్లి జానకి రాములు నగరంలో ఫొటో గ్రాఫర్‌గా పనిచేస్తున్నాడు. గుర్తు తెలియని వ్యక్తి జానకిరాములుకి ఫోన్ చేసి తమ వద్ద ఎఫ్‌ఎక్స్3 కెమెరా రూ. 75 వేలకే దొరుకుతుందని చెప్పాడు. కెమెరాలు విదేశాల నుంచి ఓడలో వస్తున్నాయని చెప్పి ముందుగా డబ్బులు చెల్లించాలని చెప్పాడు. దీంతో బాధితుడు అతను పంపిన క్యూఆర్ కోడ్ ద్వారా అతనికి రూ. 20 వేలు పంపాడు. అతను మరో సారి ఫోన్ కాల్ చేసి మరో రూ. 25 వేలు అడిగాడు. కెమెరా ఉదయం 7 గంటలకు వస్తుందని అది తీసుకున్న తర్వాత మిగిలిన మొత్తాన్ని చెల్లించవచ్చని చెప్పాడు. జానకి రాములు అతని మాటలు నమ్మి డబ్బులు పంపించాడు. బాధితుడు మొత్తం రూ. 45 వేలు చెల్లించాడు. నిందితుడు మరో సారి ఫోన్ చేసి మరో రూ. 10 వేలు అడిగాడు. తాను మోసపోయానని గ్రహించాడు. దీంతో పూర్తి సమాచారం తెలుసుకుని రెండు రోజుల క్రితం ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్‌లో బాధితుడు జానకి రాములు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

డంపింగ్ యార్డుల్లా ఖాళీ స్థలాలు

- పేరుకుపోతున్న చెత్తాచెదారం, వ్యర్థాలు
- దుర్వాసన, దోమల వృద్ధికి కారణం
- పర్యవేక్షణ లేక తీవ్రమవుతున్న సమస్య


సింగరేణి కాలనీలోని ఖాళీ ప్లాట్‌లో పేరుకుపోయిన చెత్త

సైదాబాద్: ఐఎస్‌సదన్, సైదాబాద్ డివిజన్ల పరిధిలోని పలు కాలనీల్లో నిర్మాణాలు జరగని ఖాళీ ప్లాట్లు డంపింగ్ యార్డులుగా మారుతున్నాయి. దశాబ్దాల క్రితం ఏర్పడిన కాలనీల్లోనూ అక్కడక్కడ ప్లాట్లలో ఇప్పటికీ ఎలాంటి నిర్మాణాలు చేపట్టక పోవడంతో అవి సుదీర్ఘ కాలంగా ఖాళీగా ఉంటున్నాయి. ఇదే అదునుగా చేసుకుంటున్న పలువురు చెత్తాచెదారాలను ఆయా స్థలాల్లో పడవేస్తున్నారు. దాంతో మూడువైపులా చుట్టూ ఇళ్లు ఉన్నా మధ్యలోని ఈ స్థలాలు మురికి కూపంగా మారి కాలనీవాసులను ఇక్కట్లకు గురి చేస్తున్నాయి.

సైదాబాద్, ఐఎస్‌సదన్ డివిజన్ల పరిధిలో ఆయా కాలనీలు ఏర్పడిన సమయంలో ప్లాట్లను కొనుగోలు చేసిన యజమానులు కొందరు వివిధ కారణాలతో వారి ప్లాట్లలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టలేదు. దాంతో ఈ ఖాళీ స్థలాల్లో కొందరు చెత్త చెదారాలు, వ్యర్థాలను పడేస్తున్నారు. దాంతో అక్కడ పేరుకుపోతున్న వ్యర్థాలు కుళ్లి దుర్వాసన వస్తోంది. అక్కడి అపరిశుభ్ర వాతావరణం కారణంగా దోమల వృద్ధి పెరుగుతుంది. చుట్టూ ఇళ్ల మధ్య ఖాళీగా ఉండే ఈ స్థలాల నుంచి వచ్చే దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నామని, ఖాళీ స్థలాలకు దగ్గరలో ఉండే నివాసితులు పగలు కూడా తలుపులు మూసుకోవాల్సి వస్తుందని వాపోతున్నారు. దోమల బెడదతోనూ ఇబ్బందులు పడుతున్నామని, దోమల వల్లే వచ్చే వ్యాధులు సోకుతాయనే ఆందోళన ఎక్కువైందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థలాల యజమానులు పట్టించుకోక పోవడం వలనే ఈ సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. ప్లాట్ల యజమానులు స్థానికంగా ఉండకపోవటం, ఇక్కడ పర్యవేక్షించే వారు లేక పోవడం సమస్యకు కారణమవుతున్నాయి.


ఎస్‌బీహెచ్ కాలనీలోని ఓపెన్ ప్లాట్‌లో వ్యర్థాలు

తమ ప్లాట్ల పర్యవేక్షణ పట్ల ఉదాసీనంగా వ్యవహరించే ఆయా ప్లాట్ల యజమానులపై జీహెచ్‌ఎంసీ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు. డంపింగ్‌యార్డుల్లా మారిన ప్లాట్లను వెంటనే శుభ్రం చేయించాలి. ప్లాట్లను పట్టించుకోకుండా వదిలేస్తే వాటి యజమానులకు జీహెచ్‌ఎంసీ అధికారులు జరిమానాలు విధించాలని వారు కోరుతున్నారు. తద్వారా అయినా ఖాళీ ప్లాట్ల యజమానులు తమ ఉదాసీనత మార్చుకుంటారని కాలనీవాసులు అభిప్రాయ పడుతున్నారు.

యజమానులే పరిరక్షించుకోవాలి..

కాలనీలోని నివాసాల మధ్య ఉన్న తమ ఖాళీ ప్లాట్లను వాటి యజమానులే పరిరక్షించుకోవాలి. సుదీర్ఘ కాలంగా ఓపెన్ ప్లాట్‌గా ఉన్న తమ స్థలాలు పర్యవేక్షణ లేకపోతే అన్యాక్రాంతం కావడమో, అనవసరపు వివాదాల్లో ఇరుక్కోవడమో జరుగుతుందని యజమానులు గుర్తించాలి. ప్లాట్లకు ప్రహరీ, గేట్లు ఏర్పాటు చేసుకోవాలి. తద్వారా ఎవరూ ప్లాటులో చెత్త వేయకుండా అడ్డుకోవచ్చు. అంతే కాకుండా ప్లాటును పరిరక్షించుకోనూ వచ్చు. ఖాళీ ప్లాట్‌ల యజమానులు తమ కారణంగా ఇతర కాలనీవాసులు ఇబ్బందులు పడకుండా ఉండటానికి అవసరమైన చర్యలు తప్పనిసరిగా తీసుకోవాలి.

కూరగాయల ధరలు



వనస్థలిపురం: సరూర్‌నగర్ / వనస్థలిపురం రైతుబజార్‌లలో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట కిలో రూ. 40, వంకాయ రూ. 33, బెండ రూ. 45, పచ్చిమిర్చి రూ. 35, కాకర రూ. 26, బీర రూ. 45, క్యాబేజి రూ. 30, ఫ్రెంచి బీన్స్ రూ. 45, క్యారెట్ రూ. 52, దొండ రూ. 28–35, చిక్కుడు రూ. 53, గోకర రూ. 35, బీట్‌రూట్ రూ. 45, క్యాప్సికం రూ. 55, ఆలు రూ. 36, దోస రూ. 23, సొర రూ. 15, పొట్ల రూ. 18, ఉల్లిగడ్డ రూ. 54, చామగడ్డ రూ. 35 ప్రకారం ధర పలుకుతున్నాయి. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

నాగోలు: గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎల్‌బీనగర్ పోలీసుల సమాచారం మేరకు... సాగర్ రింగ్ రోడ్డులోని శ్రీదుర్గా టింబర్ డిపో ముందు ఫ్లై ఓవర్ కింద గుర్తు తెలియని వ్యక్తి (45) మృతదేహం గురువారం వెలుగుచూసింది. ఎల్‌బీనగర్ పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుడికి కొన్ని రోజులుగా అనారోగ్యం ఉందని రెండు రోజుల క్రితమే మరణించి ఉండవచ్చని తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం ఉస్మానియా హాస్పిటల్‌కు తరలించారు.

రేపటిలోగా సర్వే పూర్తి చేయాల్సిందే: డీసీ జయంత్


డీసీ జయంత్

చాదర్‌ఘాట్: ఎట్టి పరిస్థితులలోనైనా ఈ నెల 30వ తేదీలోగా కుటుంబ సమగ్ర సర్వే పూర్తి చేయాల్సిందేనని జీహెచ్‌ఎంసీ మలక్‌పేట సర్కిల్–6 డీసీ జయంత్ సంబంధిత అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. గురువారం డీసీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ సాయంత్రం వరకు 84 శాతం సర్వే పూర్తి అయిందని తెలిపారు. నియోజకవర్గంలో 62,450 ఇళ్లు ఉండగా ఇప్పటి వరకు 53,000 ఇళ్లను సర్వే చేశామని తెలిపారు. ఇందులో 5 శాతం వివరాలు ఇవ్వనివారు ఉన్నారని తెలిపారు. పై అధికారుల ఒత్తిడి బాగా ఉందని ఆదివారం కూడా పని చేసి సర్వే పూర్తి కానిస్తామని తెలిపారు.

డీసీ కార్యాయలం తరలింపు

ఓల్డ్‌మలక్‌పేటలో ఉన్న డీసీ కార్యాలయాన్ని అక్బర్‌బాగ్ బీబ్లాక్‌లోకి తరలిస్తారు. శుక్రవారం డీసీ కార్యాలయంలో పూజలు నిర్వహించి పనులు అక్కడి నుంచి ప్రారంభిస్తామని డీసీ తెలిపారు.

పీచర వెంకటేశ్వరరావుకు నివాళి


నివాళులర్పిస్తున్న ఉద్యమకారులు

చైతన్యపురి: తెలంగాణ మలిదశ ఉద్యమ నేత, టీఆర్‌ఎస్ పార్టీ వ్యవస్థాపక సభ్యుడు పీచర వెంకటేశ్వరరావుకు పలువురు ఉద్యమకారులు ఘనంగా నివాళులర్పించారు. పీచర ప్రథమ వర్ధంతి సందర్భంగా పీఅండ్‌టీ కాలనీలో జరిగిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉద్యమ కారుడు కాచం సత్యనారాయణ మాట్లాడుతూ... ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో ఉద్యమాన్ని బలోపేతం చేయటంలో పీచర పాత్ర గణనీయమైనదని గుర్తు చేశారు. అనారోగ్యంతో గత సంవత్సరం ఆయన మృతి చెందటం బాధాకరం అన్నారు. ఉద్యమకారులు శ్రీకాంత్‌రావు, కోతి నర్సిరెడ్డి, హరీష్‌చారి, శ్రవణ్‌గుప్తా, నాగరాజు, వెంకటేశ్‌గౌడ్, హనుమంతరావు, మూర్తి, సురేష్ దత్తు, వెంకటేశ్, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు



సైదాబాద్: చెట్ల కొమ్మల తొలగింపు, పలు మరమ్మతు పనుల కారణంగా ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలోని కింద తెలిపిన ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతాయని డీఈ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు.

- ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శంకేశ్వరబజార్, గ్రీన్ అపార్ట్‌మెంట్స్, సింగరేణి కాలనీ పెట్రోల్ పంప్, పీఅండ్‌టీ కాలనీ కల్లు కాంపౌండ్, కమ్యూనిటీ హాల్, పీఅండ్‌టీ కాలనీ కౌంటర్, చౌరస్తా, కోదండరాంనగర్ హనుమాన్ టెంపుల్, వీవీనగర్, శారదా నగర్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదు.
- మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు లక్ష్మీనగర్ క్రాస్‌రోడ్, రామాలయం, వాణీనగర్, పటేలమ్మ మడిగె, ఆనంద్ బిస్కట్ ఫ్యాక్టరీ, ధోబీఘాట్ రోడ్, ఎలైట్ రెసిడెన్సీ, అఫ్జల్ నగర్, వెస్ట్ ప్రశాంత్‌నగర్, జాంజాం మిల్క్ బూత్ పరిసర ప్రాంతాల్లో కరెంట్ ఉండదు' అని డీఈ వివరించారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

లింగోజిగూడ: పేదల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని కాంగ్రెస్ పార్టీ జీహెచ్‌ఎంసీ ఫ్లోర్ లీడర్, లింగోజిగూడ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. భాగ్యనగర్ కాలనీకి చెందిన అనిల్‌కుమార్ గుండెకు సంబంధించిన వ్యాధితో ఆస్పత్రి చికిత్స పొందిన అనంతరం తమను ఆర్థికంగా ఆదుకోవాలని రాజశేఖర్‌రెడ్డిని కలిశారు. దీంతో ఆస్పత్రి బిల్లులతో సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేయించారు. దీంతో మంజూరైన రూ. 60 వేల చెక్కును గురువారం అనిల్‌కుమార్‌కు అందజేశారు. భాగ్యనగర్ కాలనీ సంక్షేమ సంఘ అధ్యక్షుడు రాము, నాయకులు కందికంటి శ్రీధర్‌గౌడ్, శ్రీధర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన



ర్యాలీ నిర్వహిస్తున్న పాణినీయ మహా విద్యాలయ విద్యార్థులు

చైతన్యపురి: విద్యార్థి దశ నుంచే చిన్నారులు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంపొందించుకోవాలని పాణినీయ మహా విద్యాలయ ప్రిన్సిపాల్ ఉషారాణి అన్నారు. రోడ్డు భద్రతపై గురువారం విద్యార్థులతో చైతన్యపురి, వీవీనగర్, కమలానగర్ కాలనీలలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. హెల్మెట్ ధరించకుండా, సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయటం వల్ల వచ్చే అనర్థాలను వివరిస్తూ విద్యార్థులు ప్లకార్డులతో అవగాహన కల్పించారు. ఆటోలలో ఓవర్ లోడింగ్, అతివేగం వల్ల జరిగే రోడ్డు ప్రమాదాలను వివరించారు.

చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలి

నాగోలు: కాలనీలలో ఎక్కడా చెత్త వేయకుండా చూడాలని... వేసిన చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని కొత్తపేట కార్పొరేటర్ నాయకోటి పవన్‌కుమార్ అన్నారు. సత్యానగర్ కాలనీలో గురువారం కార్పొరేటర్ పర్యటించారు. సత్యానగర్ కాలనీలో చెత్త కుప్పల సమస్యలు ఎక్కువగా ఉన్నాయని తమకు ఎంతో ఇబ్బందిగా ఉంటుందని స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో కాలనీలో పర్యటించారు. సానిటైజేషన్ సూపర్‌వైజర్, రాంకీ సూపర్‌వైజర్లను పిలిపించి కాలనీలో చెత్తను రోడ్డుపై ఎవరూ వేయకుండా చూడాలని సూచించారు. కాలనీలో వున్నటువంటి చెత్తను ఎప్పటికప్పుడే శుభ్రం చేయాలని, కాలనీ పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. స్థానిక నేతలు పులికంటి వెంకట్, గోపీనాథ్, చక్రవర్తి, రామకృష్ణ, మహేష్, ప్రేమ్, విజయ భారతి తదితరులు పాల్గొన్నారు.

DOCUMENT LOST
I, VV Suryanarayana S/o Late Vakalanka Pallam Raju, R/o. House No.3-90, Shanti Nagar, Hayath Nagar Mandal, R.R. Dist., TS - 501505, Lost my original registered sale deed Doct No.336/1978 (SRO Hayath Nagar) original Document owner Name: BS Ramchander Rao while travelling from P and T Colony chowrasta to Konark theatre lane. I tried to trace the lost document but put in vain. If anyone found plz contact: 9849566672

వసతుల కల్పనకు ప్రాధాన్యం

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ పరిధిలోని కాలనీలు, బస్తీల్లోని ప్రజలకు మెరుగైన వసతులను కల్పించేందుకు ప్రాధాన్యం ఇస్తున్నామని కార్పొరేటర్ రాధదీరజ్‌రెడ్డి తెలిపారు. గురువారం కార్పొరేటర్ డివిజన్‌లోని పలు కాలనీలలో పర్యటించారు. కాలనీలో నెలకొన్న పలు సమస్యల గురించి కాలనీవాసులను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీలలో భారీగా పూడిక పేరుకుపోయిందని, సమస్యలు తలెత్తక ముందే పూడిక తీయించాలని అధికారులకు సూచించారు. నిలిచి పోయిన పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను కోరారు.

క్రెడిట్ కార్డు ఇస్తామని మోసం

రూ. 1.45 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

నాగోలు: కొత్త క్రెడిట్ కార్డు ఇస్తామని చెప్పి ఓ వ్యక్తి బ్యాంక్ ఖాతాలోంచి డబ్బులు కాజేశారు సైబర్ నేరగాళ్లు. ఎల్‌బీనగర్ పోలీసుల సమాచారం మేరకు... మన్సూరాబాద్‌లోని శ్రీనివాస్‌నగర్ కాలనీ చెందిన కోటే చంద్రకాంత్ ప్రైవేట్ ఉద్యోగి. ఈ నెల 16వ తేదీన ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ నుంచి చిరంజీవిని మాట్లాడుతున్నానంటూ లైఫ్‌టైం రెంట్ ఫ్రీ కార్డు ఇస్తామంటూ ఆఫర్ చేశాడు ఓ వ్యక్తి. ఇందుకోసం అతని పేరు, బ్యాంక్ వివరాలు, ఆధార్, పాన్ కార్డ్ వివరాలు తెలుసుకున్నాడు. ఫోన్ కాల్ చేసిన వ్యక్తి చంద్రకాంత్‌కు వాట్సాప్ ద్వారా దరఖాస్తు చేయడానికి ఓ లింక్ పంపాడు. అలాగే ఒక యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోమని సూచించాడు. యాప్‌ను రిఫ్రెష్ చేస్తూనే ఉండాలని, దాన్ని మూసివేయవద్దని కాలర్ సూచించినట్లు నిందితుడు తెలిపారు. తరువాత కాల్ చేసిన వ్యక్తి ఇంటర్నెట్ బ్యాంకింగ్ కోసం ఉపయోగిస్తున్న మొబైల్ నంబర్ గుర్తించి అడిగాడు. ఫిర్యాదుదారుడు తాను వేరే నంబర్‌ని ఉపయోగిస్తున్నానని చెప్పగా కాలర్ తన బ్యాంక్ ఖాతాకు లింక్ చేసిన నంబర్‌నే ఉపయోగించాలని పట్టుబట్టాడు. ఆ వ్యక్తి తన ఫోన్‌కు వచ్చిన ఓటీపీతో సహా తన డెబిట్ కార్డ్ వివరాలను షేర్ చేశాడు. రాత్రి లావాదేవీల కోసం అనేక ఓటీపీలను అందుకున్నాడు. అనంతరం తన ఖాతా నుంచి మొత్తం రూ. 1.45 లక్షలు డ్రా అయినట్లు గుర్తించాడు. వెంటనే తన డెబిట్ కార్డును బ్లాక్ చేసి బ్యాంకులో ఫిర్యాదు చేశాడు. దీంతో బాధితుడు గురువారం ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

మహాత్మా జ్యోతిరావు పూలేకు నివాళి


న్యూనాగోలు కాలనీలో నివాళులర్పిస్తున్న నాయకులు

మన్సూరాబాద్, నాగోలు: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషిచేసిన మహనీయుడు, సంఘ సంస్కర్త, మహిళా విద్యాభివృద్ధికి మార్గదర్శిగా నిలిచిన స్ఫూర్తిప్రదాత మహాత్మా జ్యోతిరావు పూలే అని పలువురు పేర్కొన్నారు. ఆయన వర్ధంతిని ఎల్‌బీనగర్‌లో గురువారం నిర్వహించారు. ఎల్‌బీనగర్‌లోని జ్యోతిరావు పూలే విగ్రహానికి ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, టీపీసీసీ ప్రతినిధి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలు ముద్దగౌని రాంమ్మోహన్‌గౌడ్, వజీర్ ప్రకాష్‌గౌడ్, బుడ్డ సత్యనారాయణ, శ్రీపాల్‌రెడ్డి, కిషోర్‌గౌడ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

- న్యూ నాగోల్‌లోని ఎస్.ఎం.డాంగే భవన్‌లో సీపీఐ సరూర్ నగర్ మండల కార్యదర్శి బాతరాజు నరసింహ అధ్యక్షతన పూలే వర్ధంతి సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర సహాయ కార్యదర్శి బొడ్డుపల్లి కృష్ణ పాల్గొన్ని జ్యోవవు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సీపీఐ మండల సహాయ కార్యదర్శులు బోయపల్లి రాములు గౌడ్, కందుల సుధాకర్, నాయకులు కృష్ణ ఇంద్రిస్, శ్రీనివాస్, మహిళా సమాఖ్య మండల అధ్యక్షురాలు వి.నాగమణి, ఆర్.లింగస్వామి, జి.శోభ, పి.అనిత, జి.శ్రీనివాస్, మల్లేష్‌గౌడ్, పార్వతమ్మ, భాగ్య, రమణమ్మ ప్రజాసంఘాల నాయకులు, వివిధ పార్టీ శాఖల కార్యదర్శులు పాల్గొన్నారు.


ఎల్‌బీనగర్‌లో పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి


ఎల్‌బీనగర్‌లో టీపీసీసీ ప్రతినిధి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి


ఎల్‌బీనగర్‌లో కాంగ్రెస్ నేతలు...

భక్తిశ్రద్ధలతో సహస్ర దీపాలంకరణ


దీపాలు వెలిగిస్తున్న విద్యార్థినులు, పిన్సిపాల్ సురేష్ బాబు

మలక్‌పేట: కార్తీక మాసం చివరి గురువారం రోజున దిల్‌సుఖ్‌నగర్ సాయి చైతన్య జూనియర్ కాలేజ్ సహస్ర దీపాలంకరణ భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అయ్యప్ప మాల ధారణలో ఉన్న ప్రిన్సిపాల్ చెల్లగుళ్ల సురేష్ బాబు స్వామి, విద్యార్థులు కాలేజీలో దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. అయ్యప్ప చిత్రాన్ని రకరకాల పూలతో అలంకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావాలను పెంపొందించుకోవాలన్నారు. పూజల్లో లెక్చరర్లు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌లపై ఆక్రమణల తొలగింపు


మలక్‌పేట గంజ్ వద్ద అక్రమణలను తొలగిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

మలక్‌పేట: ఫుట్‌పాత్‌లను ఆక్రమించుకొని చేపట్టిన నిర్మాణాలు, వ్యాపారాలు నిర్వహించుకునేందుకు చేపట్టిన ఆక్రమణలను మలక్‌పేట ట్రాఫిక్ పోలీసులు గురువారం సాయంత్రం తొలగించారు. మలక్‌పేట, దిల్‌సుఖ్‌నగర్, మూసారంబాగ్ ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌పైన ఉన్న డబ్బాలు, చిరు వ్యాపారులను తొలగించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అశోక్ కుమార్ మాట్లాడుతూ... ఫుట్ పాత్ అక్రమణలు ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఐ రాము, సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9666021515
9505507616
9912220363
9912220365